క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



గంటా రాహుల్‌తో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్

దెందులూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గంటా రాహుల్ రిచెడ్స్‌ను సోమవారం మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గొల్ల కిరణ్ సత్కరించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు యువజన విభాగం మరింత బలపడేందుకు క్షేత్ర స్థాయిలో ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని కిరణ్ సూచించారు.

సమాజసేవలో భాగస్వామ్యం కావాలి



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అన్నారు. సోమవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ డైరెక్టర్ రత్నబాబు ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. మహిళల హాస్టల్ తరగతి గదులకు రంగులు వేశారు. కళాశాలలో ప్రధాన రోడ్డు ఆఫీస్ నూతనంగా నిర్మించే హాస్టల్ భవనం సమీపంలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దిలీప్ సొంగ, ఎన్ఎస్ఎస్ క్యాంప్ డైరెక్టర్ రత్నబాబు, కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో నిరంతరం శ్రమించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

గణపవరం: విద్యార్థి దశ నుంచి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం కాలేజీలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ కేవీ గణేష్ కుమార్, అధ్యాపకులు జి.వెంకట్రావు, అనురాధ, వెంకట రమణ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తిరుమల డైరీ ఉద్యోగులు

దెందులూరు: సీతంపేట పంచాయతీలో తిరుమల డైరీ ఉద్యోగులు సోమవారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఫ్లెక్సీలు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ వ్యక్తిగత సామూహిక పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం ఆవిర్భవిస్తుందని డైరీ ప్లాంట్ మేనేజర్ రసూల్, హెచ్ఆర్ మేనేజర్ మల్లికార్జున్, క్వాలిటీ మేనేజర్ పోల్ నాయుడు అన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు: స్థానిక యాదవనగర్ రైస్‌మిల్లు ఎదురుగా ఎరూషలేము ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో మూడు రోజుల ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తామని సిస్టర్ గ్రేస్ రాణి, సంఘ పెద్దలు తెలిపారు. చర్చిలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 29, 30, అక్టోబర్ 1న ఉదయం 11 నుంచి సాయంత్రం 6:30 వరకు ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు.

కేసు నమోదు

పెదపాడు: గంగిరెద్దు చోరీకి గురైందని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో గంగిరెద్దు ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్న ఆవల వీర్రాజు రోజూ మాదిరిగానే తన ఇంటి ముందు కట్టివేశానని తెలిపారు. ఈ నెల 13న 7 గంటల సమయంలో ఇంటి ముందు కట్టిన ఎద్దు తెల్లవారు జామున మూడు గంటల సమయంలో చూడగా తాడు కోసి ఉన్నట్లు గమనించి చుట్టు పక్కల గ్రామాల్లోనూ, పశువుల సంతలోనూ వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 21న పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఎస్సై ఎన్.గజపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డెక్కితే ఒళ్లు హూనం

- అధ్వానంగా నల్లజర్ల–లక్ష్మీనగరం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఉంగుటూరు: నల్లజర్ల–లక్ష్మీనగరం రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణిస్తే ఒళ్లు హూనమేనని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కాలు తీసి కాలు వేయాలంటే నరకంగా ఉంది. కూటమి ప్రభుత్వం వస్తే రహదారులు అందంగా తీర్చి దిద్దుతామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక వాటి వంక నాయకులు, అధికారులు చూడని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిలో ఉంగుటూరు మండలం మెట్టప్రాంతంలో ఆరు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు ఏకైక మార్గం ఈ ఒక్క రహదారి మాత్రమే. ఆరు గ్రామాల ప్రజలు బయట గ్రామాలకు వెళ్లాలన్నా, లోపలికి రావాలన్నా, వైద్యానికి వెళ్లాలన్నా, ఇదే దారి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం రద్దీగా రహదారి

వ్యవసాయ ఉత్పత్తులు బయటకు వెళ్లాలన్నా, విద్యార్థులు విద్యా సంస్థలకు వెళ్లాలన్నా ఇదే దారి. దీంతో నిత్యం ఈ రహదారి వాహన చోదకులతో రద్దీగా ఉంటుంది. దీంతో రైతులు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువులు తలపించేంతగా గుంతలు మారిపోయాయి. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపురం, పందిరెడ్డిగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, యర్రమల్లిపాడు, గొల్లగూడెం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారిని ఉపయోగిస్తుంటారు. ఆయా గ్రామాలకు ఏకైక మార్గ ఇదే. దీంతో ఆ గుంతల్లో నుంచి పడుతూ లేస్తూ ప్రయాణం తప్పని పరిస్థితిగా సాగిస్తున్నారు. పాలకులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం శూన్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేయిస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు ఏమి చేస్తున్నారు లే అంటూ ప్రజలు నిట్టూర్పు వదలుతున్నారు.



రామచంద్రపురం వద్ద రోడ్డు దుస్థితి



యర్రమిల్లిపాడు వద్ద చెరువులను తలపిస్తున్న గుంతలు

ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

నిడమర్రు: మండలంలో ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న ఆర్అండ్‌బీ రహదారులను తక్షణం మరమ్మతులు చేయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు అన్నారు. సోమవారం మందలపర్రు–నిడమర్రు ఆర్అండ్‌బీ రహదారి వద్ద అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు ధర్నా చేశారు. మండల కేంద్రం నిడమర్రుకు రావాలంటే ఈ గోతుల్లో నిత్యం అనేక ప్రమాదాలతో ప్రయాణికులు ఆసుపత్రుల పాలయ్యారని తక్షణం రోడ్డు వెంబడి ఉన్న గుంతలు, సీసీ–బీటీ అప్రోచ్‌ల వద్ద కుంగిపోయిన గుంతల్లో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ధర్నాలో పలువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో నేతలు గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు తదితరులు పాల్గొన్నారు



నిడమర్రు: మందలపర్రులో అధ్వాన రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

భీమడోలు: గుండుగొలను బీసీ కాలనీ రత్నాపురం రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భక్తులు, మహిళలు 108 కలశాలతో జలాభిషేకం, పంచామృత ఫలరస అభిషేక పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఎస్ఎంఎస్ సుదీరాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మల్లెల దుర్గాప్రసాద్, సోమాలి దుర్గాప్రసాద్, మణిపూరి అక్కయ్య, వెలగల సతీష్, ఎస్.శివ, ఎం.తిరుపతిరావు, సీహెచ్ పెద్దిరాజు, వెలగల మణమ్మ, చిలుకోటి రంగమ్మ, మాజీ ఉప సర్పంచ్ బర్ల రమణమూర్తి, వార్డు సభ్యుడు నల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఆరంభం

మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో వాడవాడలా వెలిసిన ఉత్సవ పందిళ్ల వద్ద అమ్మవార్లు కొలువయ్యారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి వెండి చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నరెడ్లగూడెంలోని గద్దెపై వేంచేసియున్న అమ్మవారికి విశేష పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, సాయి ఆచార్యులు, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ వగ్వాల మీనాకుమారి, పెద్దలు వగ్వాల అచ్యుతరామారావు, సీతారామరాజు, నీలంశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

దెందులూరు: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), మాజీ సర్పంచ్ మాగంటి కనకదుర్గ అన్నారు. సోమవారం దసరా మహోత్సవాలను గోపన్నపాలెం శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ సభ్యులు కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దాసరి కాళీమోహన్ వెంకట మౌనిక దంపతులు అమ్మవారిని అలంకరించారు. శ్రీరామవరం, దెందులూరు, పోతునూరు, కొవ్వలి, సీతంపేట, రామారావుగూడెం, చల్ల చింతలపూడి, గంగన్నగూడెం, గాలాయగూడెం, సోమవరప్పాడు, జోగన్నపాలెం గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు

నిడమర్రు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి మండలంలో వైభంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారి విగ్రహ మండపాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో అమ్మవారు స్వర్ణ కవచ బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. బువ్వనపల్లి గ్రామదేవత వడలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి సందర్భంగా ప్రతి రోజూ కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నవరాత్రి పూజలు ప్రారంభం

ఉంగుటూరు: మండలంలో అమ్మవార్ల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 9 రోజులు పూజలు నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు ,కైకరం, బాదంపూడి రాచూరు, గొల్లగూడెం తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్నారు.



భీమడోలు: నీటి బిందెలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు



భీమడోలు: భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి



దెందులూరు: అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



నిడమర్రు: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

భీమడోలు: మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గుండుగొలను వైద్యాధికారిణి జాహ్నవీరెడ్డి అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో సోమవారం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరాలకు వచ్చిన మహిళలు, యువతులకు బీపీ, షుగర్, రక్తహీనత, హిమోగ్లోబిన్, వైద్య పరీక్షలు చేశారు. మహిళలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్

గణపవరం: మహిళల ఆరోగ్యరక్షణకు స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకం దోహదపడుతుందని ఈ పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. సోమవారం మండలం అగ్రహార గోపవరంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ పాతంశెట్టి పద్మ అధ్యక్షత వహించారు. 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు: గ్రామాలకు వచ్చి వైద్యాధికారులు నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం సర్పంచ్ పర్సనల్ లక్ష్మీసుజాత అన్నారు. కొత్తగూడెం గ్రామంలో సోమవారం పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు చైతన్య, శాంతకుమారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తగూడెం, కొమిరేపల్లి, గుండుగొలను, శింగవరం ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు బాలికలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ హరి ఏఎన్ఎంలు ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు నిర్వహణ

ఉంగుటూరు: ఉంగుటూరు, వెల్లమిల్లి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. సోమవారం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఆయుర్వేద ఆసుపత్రి వైద్యుడు పి.శంకర్ ప్రసాద్‌రాజు, వైద్య సేవలు అందజేశారు. సర్పంచి బండారు సింధు, శరణాల మాలతీరాణి, తదితరులు పాల్గొన్నారు.



దెందులూరు: వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



భీమడోలు: ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



గణపవరం: మాట్లాడుతున్న వైద్యాధికారి

వేతన బకాయిలు విడుదల చేయాలి

కుక్కునూరు: హమాలీల మూడు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గోదావరి వరదల నేపథ్యంలో రేషన్ షాపులకు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు స్టాక్‌ను ముందే తరలించారు. ఆ తోలకాలకు సంబంధించిన బిల్లులను హమాలీలకు ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, హమాలీ యూనియన్ సభ్యులు కారం రమేష్, కదారి తిరుపతయ్య, తిరోజుల సురేష్, సాయిరాం, వెంకటేష్, విక్రమ్, లక్ష్మణ్, వెంకట్రావు, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

నేటి నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు

భీమడోలు: మండల పరిధిలో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులను ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సచివాలయాల వద్ద ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ఆరేళ్ల లోపు చిన్నారులు, 6 ఏళ్ల నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థినీ విద్యార్థులకు ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చునన్నారు. భీమడోలు సచివాలయం–1 వద్ద 23, 24వ తేదీల్లోనూ, పోలసానిపల్లి సచివాలయంలో 25, 26వ తేదీల్లోను, దుద్దేపూడి సచివాలయం వద్ద ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీల్లో మొబైల్ ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 82 మందికి పంపిణీ చేశారు.

పోరాటాల ఫలితమే జీఎస్టీ రద్దు



సంబరాలు చేసుకుంటున్న ఎల్ఐసీ యూనియన్ ప్రతినిధులు, ఏజెంట్లు

భీమడోలు: జీవిత బీమా కంపెనీ ఏవోఐ యూనియన్ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలను రద్దు చేసిందని ఎల్ఐసీ భీమడోలు శాటిలైట్ ఏవోఐ గౌరవ అధ్యక్షుడు గోదావరి జగన్‌మోహనరావు అన్నారు. భీమడోలు ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం వద్ద సోమవారం దేశవ్యాప్తంగా ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీలను రద్దు చేసిన నేపథ్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు విజయోత్సవాన్ని చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కమ్మిల సుబ్బావు, కార్యదర్శి తలగళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి శీమకుర్తి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు బొజ్జ వెంకట దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూజారి వెంకట రమణ, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్లపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న కరస్పాండెంట్

దెందులూరు: ప్రతి ఒక్కరూ కాన్సర్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో 20 రకాల క్యాన్సర్లపై నర్సింగ్ విద్యార్థులు ఫొటో ప్రదర్శన, మెగా అవగాహన సమావేశం నిర్వహించారు. లివర్, కిడ్నీ, గొంతు, ఊపిరితిత్తులు, గుండె, తల, రొమ్ము, నోటి క్యాన్సర్ బొమ్మలతో కూడిన చిత్రాలను నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించారు.

గ్రంథాలయం కోసం నిరాహార దీక్ష

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలో గ్రంథాలయం వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన ఏనుగు రాంబాబు సోమవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. మూడు కూడళ్ల సెంటర్‌లో వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల కేంద్రీయ విద్యాలయం, ఇంజనీరింగ్ కళాశాల, ఉన్నత పాఠశాల మొదలైన సంస్థలతో గోపన్నపాలెం రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి ప్రతిష్ఠలను కలిగి ఉన్నారు. ఇటువంటి గోపన్నపాలెంలో నిరుద్యోగులు, ఉద్యోగులకు అవసరమైన గ్రంథాలయం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని గోపన్నపాలెంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజల విజ్ఞాన సమాచార అవసరాలు కాపాడాలని ఆయన కోరారు.



నిరాహారదీక్ష చేస్తున్న గోపన్నపాలెం గ్రామస్తులు

ఈదురుగాలులతో భారీ వర్షం

పెదపాడు: మండలంలో పెదపాడు పరిసర ప్రాంతంలో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్, రహదారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది సోమవారం ఉదయం వాటిని పునరుద్ధరించారు. విద్యుత్ లైన్లు పునర్ధించేందుకు మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేశారు.

ఉంగుటూరులో కుండపోత

ఉంగుటూరు: మండలంలో కుండపోత వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి. ఆదివారం సాయంత్రం 34. 2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా కురిసింది. దీంతో రహదారులు చిత్తడిగా మారాయి. డ్రైయిన్లు పొంగి ప్రవహించాయి. మురుగు డ్రైయిన్లలో నీరు రోడ్ల మీద ప్రవహించింది. ఇదే పరిస్థితి నారాయణపురం, కైకరం, చేబ్రోలు, బాదంపూడి, నాచుగుంట గ్రామాల్లో నెలకొంది. ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలతో పంట పొలాలు దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు.



గాలులతో కూడిన వర్షానికి విరిగిన చెట్లు

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

లింగపాలెం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, కలరాయనగూడెం సర్పంచ్ చల్లగుళ్ల రవిబాబు తల్లి శ్యామల ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నివాసంలో సోమవారం శ్యామల చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మోరంపూడి జగన్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నూతులపాటి శ్రీనివాస్, ముళ్ళపూడి సుమన్ తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.